# మంగళం మంగళం

పొత్తూరి విజయలక్ష్మి

రైలు గమ్యాన్ని సమీపిస్తున్నకొలదీ నాలో ఉత్సాహం పురకలు వెయ్యడం మొదలుపెట్టింది. అది చాలా సహజం. మేము వుండేది మన రాష్ట్రానికి చాలా దూరంగా.

అక్కడ ఎన్ని సౌకర్యాలు వున్నా ఆ లోటు లోటే మరి.

మనవైపు రావటం అంటే భలే సంతోషంగా వుంటుంది. జననీ జన్మభూమిశ్చ అని అందుకే అన్నారు మరి! అదివరకు కూడా మేము శలవులకి స్వంతవూరు వెళ్ళేవాళ్ళం. అప్పుడేవిటో ఏ మార్పూ లేకుండా పడుండేది మన రాష్ట్రం.

ఈమధ్య కొన్నేళ్ళుగా బోలెడంత మార్పు వచ్చేసింది. ఈ పూట వున్న రూల్సు మర్నాటికి వుండడం లేదుట. ఎంతబాగుంటుందో అలా వుంటే.

ఆ మధ్య నేను ఒక్కదాన్నే పిల్లల్ని వెంటబెట్టుకుని మా ఊరు ప్రయాణం అయ్యాను. బాపట్లలో రైలుదిగి బస్టాండుకి వెళ్ళాను. మా ఊరు అక్కడికి తొమ్మిది మైళ్ళు. బస్టాండులో రిక్షాదిగి సామాన్లు పట్టుకుని లోపలికి వెళ్ళి కనుక్కుంటే మరో అరగంట తరువాత వస్తుంది బస్ అని చెప్పారు.

'అమ్మా ఎక్లేర్లు!' అన్నాడు నా పుత్రుడు. 'వాడికవి కొంటే నాకు గోల్డ్ స్పాట్ కొనాల్సిందే.' అని బెదిరించింది పుత్రిక. తప్పేదేముంది. సామాన్లు కాస్త చూస్తూండమని పక్కవాళ్ళను రిక్వెస్ట్ చేసి పక్కనే వున్న కిళ్ళీకొట్టు దగ్గరికి వెళ్ళాను.

"నాలుగు ఎక్లేర్ చాక్లెట్లూ రెండు గోల్డ్ స్పాట్లూ ఇవ్వండి." అన్నాను వెనక్కితిరిగి సామాన్లు చూసుకుంటూ.

"ఓసీ నీ దుంపతెగ! నువ్వటే! ఎక్కడినుంచి రావటం!" అని పలకరించాడు ఆ కిళ్లీకొట్టాయన. అదిరిపడి చూశాను.

ఎదురుగా మా మామయ్య. సాక్షాత్తూ నా మేనమామ. మా ఊరి కరణం. అతగాడ్ని అలా కిళ్ళీకొట్లో చూసి స్టన్ అయిపోయాను. 'ఇదేమిటీ మామయ్యా!' అన్నాను.

"అదంతేలే. కరణాల్ని ఉద్యోగా



ల్లోంచీ పీకేశారుగా." అంటూ వివరంగా చెప్పుకొచ్చాడు. ఆశ్చర్యంగానే విన్నాను. నా కసలా వివరాలేవీ తెలీవు. నాకేమో పేపరు చదివే అలవాటు లేదు. ఉత్తరాలూ రాయను. మా ఇంట్లో అందరం అంతే. నో న్యూస్ ఈజ్ గుడ్ న్యూస్. ఏ పెళ్లో పేరంటమో అయితేగానీ ఉత్తరాలు రాసుకోరు.

"మరెలా మామయ్యా?" అన్నాను.

"ఏం ఫర్వాలేదు. వ్యాపారం బాగానే వుంది" అన్నాడు.

మా మామయ్య కరణీకం పోతే పోయిందిగానీ నాకు అక్కడ బస్టాండ్‌లో మాత్రం దివ్యంగా గడిచిపోయింది. మా పిల్లలు చాక్లెట్లు తిని కూల్ డ్రింకులు తాగారు. నేనూ మామయ్య కబుర్లతో కాలక్షేపం చేసేశాం. బస్‌రాగానే నాకే మాత్రం శ్రమలేకుండా మామయ్యే టికెట్లు కొని ఎంచక్కా కిటికీదగ్గర సీట్ కూడా రిజర్వ్ చేసిపెట్టాడు. దర్జాగా వూరికి వెళ్ళిపోయాను.

ఆ తరువాత కొన్నాళ్ళకి చుట్టాల ఇంట్లో పెళ్ళయితే నేను ఒక్కదాన్నే బయలుదేరాను. యథాప్రకారం బాపట్లలో దిగి బస్టాండుకి వెళ్ళాను. బస్ ఎప్పుడు ఏమిటి అని తాపత్రయ పడలేదు. దర్జాగా సూట్‌కేస్ పట్టుకుని కిళ్ళీ కొట్టు దగ్గిరికి వెళ్ళిపోయాను. పేపర్

చదువుకుంటున్నాడు.

"మావయ్యా నేనొచ్చేసేనూ!" అని అరిచాను. అరుపు వినపడేలా. పేపరు తొలగించాడు ఆ పెద్దమనిషి. నాకు తెలీకుండానే కెవ్‌మన్నాను. నల్లగా బుర్రమీసాలూ మెళ్ళోగొలుసూ వళ్ళికి లించి అదోలా నవ్వేడు. ఆ మహానుభావుడు అతనేకాదు చుట్టుపక్కల జనం కూడా నావంక ఎగతాళిగా చూడటం గమనించాను.

ప్రాణం చచ్చిపోయింది. వెనక్కి తిరిగి ఒక్కపరుగున కదుల్తున్న బస్‌లో ఎక్కేశాను. అది చీరాల బస్. చీరాల వెళ్ళి, అక్కడినించి గుంటూరువెళ్ళి అక్కడినించి పొన్నూరు వెళ్ళి అక్కడ బస్ ఎక్కి మా ఊరు చేరేసరికి చీకటి పడిపోయింది.

పడుతూ లేస్తూ ఇంటికి చేరేసరికి వాకిట్లోనే ఎదురయ్యాడు మామయ్య. "అరే లక్ష్మీ నువ్వా? ఈవేళప్పుడు ఎక్కడినించి రాక?" అని నవ్వుతూ పలకరించాడు.

కోపం దుఃఖం ముంచుకు వచ్చాయి. నా అనుభవం చెప్పాను. చెడామడా తిట్టాను.

అంతా విని నవ్వేశాడు మామయ్య. "నీ తలకాయ! పీకేసిన కరణాల్లో కొంతమందికి మళ్ళీ ఉద్యోగాలు ఇస్తారుట. నా పేరూ ఆ లిస్టులో వుంది. ఉద్యోగం వస్తుందికదా అనే ఆశతో ఆ వ్యాపారం వదిలేశాను. అయినా కాస్త నిలుపూ నిదానం వుండొద్దు నీకు!" అని మందలించి మళ్ళీ నవ్వేశాడు. అప్పుడు ఒళ్ళు మండినా తరవాత నాకూ నవ్వు వచ్చింది.

ఆ తరువాత కూడా ఎప్పుడు ఇటు వైపు వచ్చినా ఏదో మార్పు కనిపిస్తూ వచ్చింది. గొప్ప థ్రిల్‌గా అనిపించ సాగింది ప్రయాణం అంతా. అందుకే మావారు టూర్ వెళ్తుంటే తోకలా వెంట బయలుదేరాను.


విజయవాడలో నన్ను వదిలేసి జాగ్రత్తలు చెప్పి తిన్నగా మద్రాస్ వెళ్ళిపోయారు ఆయన. నేను రైలెక్కి భాగ్యనగరంవైపు ప్రయాణంఅయ్యాను. ఆనవాయితీ ప్రకారం ఆలస్యంగా రాత్రి పదిగంటలకి చేరింది రైలు. అంత రాత్రివేళ వంటరిగా వెళ్ళడానికి ధైర్యం చాలక స్టేషన్‌నించి మా సుజాతకి ఫోన్ చేశాను.

అదృష్టం బాగుంది. లైను వెంటనే దొరికింది. సుజాత తీసింది. "నేను లక్ష్మిని" అన్నాను. "నువ్వా ఏమిటీ విశేషం?" అని చెవులు చిల్లులుపడేలా అరిచింది.

"అరిచ్చావకు. ట్రంకాల్ కాదు. ఈ పూర్నించే మాట్లాడుతున్నా" అనేసి వివరంగా చెప్పాను. ఫోన్లోనే సంతోషించింది. పదినిముషాల్లో వస్తున్నాం వెయిట్ చెయ్యి అని చెప్పింది.

అమ్మయ్య అనుకుని స్టేషన్ బయట కొచ్చి నిలబడ్డాను. చెప్పినట్లే పదినిముషాల్లో వచ్చేశారు దంపతులు. ఆటోలో ఇంటికి వెళ్ళాం.

వెళ్ళగానే వేడిగా కాఫీ ఇచ్చింది. కాసేపాగి కమ్మటి భోజనం పెట్టింది. ఇద్దరం నోరుమూతపడకుండా కబుర్లు చెప్పుకున్నాం. మాట్లాడుకుంటూనే నిద్ర




పోయాం.

లేచేసరికి బాగా ఎండెక్కిపోయింది. లేచి ఇవతలికి వచ్చేసరికి ఎదురయ్యాడు ఆనంద్. తెల్లటి వంచె బెంగాలీకట్టు కట్టుకున్నాడు. తెల్ల లాల్చీ వేసుకున్నాడు. కాశ్మీర్ శాలువా కప్పుకున్నాడు. తలమీద హెల్మెట్.

"గుడ్ మార్నింగ్. బాగా నిద్ర పట్టిందా?" అని పలకరించాను.

"వెళ్ళొస్తా. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది!" అనేసి స్కూటర్ మీద వెళ్ళిపోయాడు. ఆశ్చర్యంనుండి తేరుకునేసరికి కనుమరుగైపోయాడు. అతనికీ వంచెకట్టుకీ ఆరామడలుదూరం. పెళ్ళిలో ఆ కాసేపటికే అతను చేసిన హంగామా తల్చుకుని ఇప్పటికీ నవ్వుకుంటూ వుంటాం.

మరలాటిది ఆఫీసుకి అంత తీరుగా పంచెకట్టుకు వెళ్ళటం ఏమిటో. ఉక్కపోసి చస్తుంటే ఆ శాలువా ఏమిటో అర్థంకాలేదు. వంటింట్లోకి వెళ్ళాను. అష్టావధానం చేస్తోంది సుజాత.

"తెల్లవారిందా తల్లీ? త్వరగా తయారవు. నాతో ఆఫీసుకి వద్దువుగాని ఓ గంటసేపు ముఖం చూపించి పర్మిషన్ తీసుకుంటాను. అట్నించి ఎటైనా వెళ్దాం. ఇంకా నిలబడతావేం? కదులు" అంటూ కంగారుపెట్టేసింది.

అరగంట తర్వాత ఇంటికి తాళం వేసి బయలుదేరాం. బస్టాప్‌కి చేరాం. జనం చాలామంది వున్నారు. కబుర్లు చెప్పుకుంటూ నిలబడ్డాం.

మా దగ్గరకి ఒకతను వచ్చాడు. మోకాళ్ళదాకా కాషాయరంగు పంచె కట్టుకుని భుజాన ఆదేరంగు ఉత్తరీయం వేసుకున్నాడు. గడ్డాలు మీసాలు మా ఎదురుగా నిలబడి ఏదో చెప్పబోయాడు.

వెంటనే నేను ఫో ఫో ఫో అని చెయ్యి చూపించాను. నా కాలు వచ్చదయ్యేలా తొక్కింది సుజాత. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి నాకు, కోపంగా చూశాను.

"సారీ సర్! ఇది మా ఫ్రెండ్. ఎక్కడో బెంగాల్‌లో వుంటారు వీళ్ళు. దీనికి మన పద్ధతులు తెలీవు" అంటూ

ఆయనకి క్షమాపణలు చెప్పేసి నావైపు తిరిగింది.

"లక్ష్మీ! వీరు సుబ్బారావుగారు. మా సెక్షన్ ఆఫీసర్!" అని పరిచయం చేసింది. కాలినొప్పి, కోపం అన్నీ మర్చిపోయాను నేను. సుజాతతో ఏదో మాట్లాడేసి అప్పుడే వచ్చిన బస్ ఎక్కేసి వెళ్ళిపోయాడాయన,

ఆశ్చర్యం నుండి తేరుకున్నాను. "సుజా! పిట్టలదొరలా వేషం, అదీ. ఆయన ఆఫీసరేమిటే నీ మొహం!" అడిగాను.

"అదంతేలే. ఈమధ్య మాకు ఓ కొత్త రూల్స్ పెట్టారు- గెజిటెడ్ ఆఫీసర్లు అందరూ విధిగా ఏవైనా వేషంవేసుకుని ఆఫీసుకి రావాలి" చెప్పింది సుజాత.

అయోమయంగా అనిపించింది నాకు. నా అవస్థ గమనించి వివరంగా చెప్పింది. మొదట్లో అందరం ఇలాగే వెర్రిమొహాలు వేశాం నీలాగే. ఆ తరువాత నెమ్మదిగా అర్థం అయిపోయింది.

ఆఫీసర్లు అందరూ విధిగా ఏదైనా దేశనాయకుడి వేషంగానీ చరిత్రకారుడి వేషంగానీ ధరించి ఆఫీసుకి రావాలి. ఆ జీ ఓరాగానే ఆనంద్ శివతాండవం ఆడేడాడు. ఉద్యోగం వదిలేస్తానన్నాడు. ఇంకా ఏమిటో చాలా చాలా అన్నాడు. కానీ తప్పుతుందా! రాజీపడిపోయి సూట్ కుట్టించేసుకుని ఇత్తడి గుండీలు పెట్టుకుని టోపీ కొనుక్కుని లార్డ్ మౌంట్ బాటన్‌లాగా వెళ్ళాడు. కానీ అదేం లాభం లేదన్నారు. భారతీయుల వేషాతే వెయ్యాలిగానీ ఫారినర్స్ వేషాలు పనికి రావు అని చెప్పారు.

ఇక లాభంలేదని మరో పదిరోజులు బుర్ర బద్దలు కొట్టుకుని చివరికా వేషం ఎంచుకున్నాడు.

అప్పటికి మెల్లిగా అర్థం అవసాగింది. "అయితే ఆ వేషం?" అడిగాను.


"బెంగాల్‌లో వుంటూ కూడా గుర్తు పట్టలేకపోయావా? చిత్తరంజన్‌దాస్. ఇందాక నువ్వు చూశావే సుబ్బారావుగారు ఆయన అల్లూరి సీతారామరాజు వేషం ధరించారన్నమాట. ఏదో మీటింగుంటే హడావిడిగా బయలుదేరడంతో ధనుర్బాణాలు మర్చిపోయారుట. ఇక్కడదిగి వెనక్కి వెళ్ళారు" చెప్పింది సుజాత.

ఇంకా ఎన్నో అడగాలని వున్నా బస్ రావటంతో, అడగలేకపోయాను. పరిగెట్టుకుంటూ వెళ్ళి బస్ ఎక్కాం. బస్‌లో ఇద్దరు ముగ్గురు వేషధారులు కనిపించారు.

ఆఫీసుకి వెళ్ళాం. దాని సీట్లో కూర్చుంది సుజాత. పక్కన కుర్చీలో కూర్చున్నాను నేను. కూర్చునే ఆఫీసులో అందరి పేర్లు, వాళ్ళకి తను పెట్టిన మారుపేర్లు చెప్తూ వుంటే నవ్వకుండా గంభీరంగా విన్నాను.

కాసేపటికి ఒకాయన వచ్చారు. నేతాజీలా డ్రెస్ చేసుకున్నాడు. ఆయన వాళ్ళ ఆఫీసరుట. ఎకౌంట్స్ సైడ్. మరి కాసేపటికి రాజారామ్మోహనరాయ్ వేషంలో వున్నాడు ఆయనాఆఫీసరేనట. పెర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడుట.

అందరికంటే ఆఖరుగా వేంచేశారు సుబ్బారావుగారు. గాబరాగా తన రూంలోకి వెళ్ళిపోయాడు. బెల్ కొట్టి సుజాతని పిలిపించి ఏదో పని అప్పగించాడు. అది




పనిచేసుకుంటూ వుండే నేను ఏదో పుస్తకం తిరగేస్తూ కూర్చున్నాను.

ఆఫీసులో పెద్దగా వాదన మొదలైంది. అందరిదృష్టి అదే కేంద్రీకరించబడింది. సుబ్బారావుగారు ఎవర్నో కేకలేస్తున్నారు. అతడుకూడా వూరుకోలేదు. హోరాహోరీ దెబ్బలాడుతున్నాడు.

"ప్రతిరోజూ ఆలస్యంగా వస్తావేం ఆఫీసుకి?" అంటారు సుబ్బారావుగారు.

"నేను కరెక్ట్ టైంకే వస్తున్నాను. మీరే ఆఫీసు తొందరగా మొదలెట్టేస్తున్నారు" అన్నాడు అవతలాయన.

"ఏంకాదు పంచమి పొద్దున పదింటికే ప్రవేశించింది." గట్టిగా అరిచాడు సుబ్బారావ్.

"కాదు. పదకొండున్నరకి ప్రవేశిస్తుంది పంచమి!" గర్జించాడు రెండో అతను.

"ఆంజనేయ సిద్ధాంతిగారి పంచాంగం ప్రకారం ఆఫీసు నడుస్తోంది!" అరిచాడు సుబ్బారావ్.

"కావచ్చు. మా ఇంట్లో ఎప్పుడూ వీరభద్రావధానులుగారి పంచాంగమే పాలో అవుతాం. నేను దాన్నిప్రకారమే ఆఫీసు కొస్తా" అరిచాడు అతడు.

మళ్ళీ అయోమయంగా సుజాతవంక చూశాను. "అదేలేవే? మేము ప్రస్తుతం పంచాంగం వేళలు పాటిస్తున్నాం?" అని చెప్పింది. అవతల పోట్లాట తారాస్థాయి చేరుకుంది. "అదివరకు వార్నింగ్ ల ఇచ్చి వూరుకున్నాను. ఇక వూరుకోను అబ్సెంట్ మార్క్ చేస్తా!" తీవ్రంగా చెప్పారు సుబ్రావ్ గారు.

"ఏవిటీ! నాకు అబ్సెంట్ చేస్తావా మహోగ్రంగా అరుస్తూ షర్టుచేతులు పైకి లాక్కుంటూ ఆయనతో కలియబడి ఆయన ధనుర్బాణాలు లాగి అవతల పారేశాడు అతను.

అందరూ పన్లాపేసి వాళ్ళదగ్గిరికి పరుగెట్టారు. వాళ్ళిద్దర్నీ విడదీశారు. రాజా మోహనరాయ్ గారూ, సుభాస్ చంద్రబోస్ గారూ (మన్నించాలి అసలు పేర్లు తెలీవు) కూడా అక్కడికి వచ్చారు.

ఆఫీసర్లంతా ఓ వైపు ఎన్ జీటీ




అంతా ఓ వైపు చేరి బాగా దెబ్బలాడుకున్నారు. కాసేపటికి ఆ గోల మణిగింది. అందరూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

ధుమధుమలాడుతూ సుబ్బారావుగారు తన రూమ్‌లోకి వెళ్ళిపోయారు. ఓ మూల పడున్న ఆయుధాలు తీసుకుని లోపలికి వెళ్ళింది. ఆయన స్టెనో మా సుజాత. వెంట నేనూ వెళ్ళాను.

"సర్! ఇవిగోండి సార్. ఇందాక పడిపోయాయి" అంటూ వినయంగా అందించింది.

బోలెడంత దుఃఖం వచ్చింది ఆయనకి. "ఈ గడ్డమే సర్దుకోనా! ఈ ఆయుధాలే జాగర్త చేసుకోనా. అటు ఆఫీసే కంట్రోల్ చేసుకోనా! ఏమిటో ఖర్మ" అని విసుక్కున్నాడు.

ఇక అక్కడ వుండేది ప్రమాదమని పరుగున ఇవతలికి వచ్చేశాను. అయిదు నిముషాల తరువాత వచ్చింది సుజాత.

"సుజా! నీక్కూడా ఏ ప్రమోషనో వచ్చేసి ఆఫీసర్‌వి అయిపోయావనుకో. నువ్వేం వేషం వేసుకుంటావే మరి!" కుతూహలంగా అడిగాను.

ఉరిమి చూసి "చంపుతా!" అంది గుర్రుగా. వెంటనే నోరు మూసుకున్నాను.

సుబ్బారావుగారి మూడ్ బాగాలేకపోడం వల్ల సుజాతకి పర్మిషన్ అడగడానికి వీలవలేదు. కాబట్టి ఆ రోజంతా ఆఫీసులోనే గడిపేశాం. మర్నాడు నేను బాపట్ల వెళ్ళాలి.

మర్నాడు పొద్దునే నా ప్రయాణం. ఉండమని వాళ్ళు చాలా బలవంతం చేశారుగానీ నేనే వీలుకాదని చెప్పాను. మళ్ళీ వస్తానే అన్నాను. తెల్లవారుజామునే లేచి తయారయ్యాను. "బస్సు ఎన్నింటికి బయల్దేరుతుందో కనుక్కుంటా!" అన్నాడు ఆనంద్.

"అదేమిటి?" అని అడిగాను.

చిన్నగా నవ్వి నెంబర్ డైల్ చేసి రిసీవర్ నాకు అందించాడు. "బాపట్ల బస్ ఎప్పుడు ఉంది?" అడిగాను.

"మామూలుగా అయితే ఆరింటికి బయలుదేరాలి. కానీ వర్షం వుంది" ఏదో చెప్తూ వుండగానే ఫోన్ పెట్టేశాను. ఆశ్చర్యపోడానికి కూడా ఓపిక లేక పోయింది.

ఎనిమిదింటికి కదిలిన బస్సులో కూర్చుని వెళ్ళిపోతూ వుంటే చెప్పలేనంత దిగులు వేసింది — నా రాష్ట్ర ప్రజల్ని తల్చుకుంటే!